క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

29న కలెక్టరేట్ ఎదుట ధర్నా



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి కూలీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 29న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. పెదముషిడివాడలో బుధవారం ఉపాధి కూలీలు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కొలతలతో సంబంధం లేకుండా కనీస కూలి రూ.272 చెల్లించాలన్నారు. ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇటీవల పెదముషిడివాడలో తేనెటీగల దాడిలో గాయపడిన కూలీలను ఆదుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఉక్కు ఆస్పత్రి స్లాట్ విధానంలో మార్పులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న స్లాట్ విధానంలో మార్పులు చేశారు. ఆస్పత్రి వైద్యులు, స్పెషలిస్టుల వద్దకు వెళ్లడానికి ఇప్పటి వరకు స్లాట్ విధానం ఉంది. స్లాట్ దొరకని రోగులు వెనక్కి తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ అంశంపై ఇటీవల ఐఎన్‌టీయూసీ నాయకులు ఆస్పత్రి యాజమాన్యానికి వివరించి స్లాట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన యాజమాన్యం ఆస్పత్రి స్పెషలిస్టులు, వైద్యులు తమ స్లాట్ పూర్తయిన తర్వాత అక్కడ వేచి ఉండే రోగులను పరీక్షించనున్నారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సీనియర్ జర్నలిస్టు ప్రసాద్ మృతికి సంతాపం



ప్రసాద్ (ఫైల్)

సబ్బవరం: సబ్బవరానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గొట్టేటి లక్ష్మీ ప్రసాద్ బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. జీఎల్ ప్రసాద్‌గా సుపరిచుతులైన ఆయన ఈనాడు, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, వార్త వంటి పలు దినపత్రికల్లో పని చేశారు. ప్రస్తుతం విశాలాంధ్రలో పనిచేస్తున్నారు. అనారోగ్యంతో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సబ్బవరం ప్రెస్ క్లబ్ సభ్యులు పి. మాణిక్యాలరావు, నరసింహం, పందూరి సత్యప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

28న 'ఘంటసాల జీవిత చరిత్ర' నాటకం

దాబాగార్డెన్స్: భారతదేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవా రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్ర మ వివరాలు వెల్లడించారు. శ్రీభాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో ఆ రోజు సాయంత్రం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ నాటకం ప్రదర్శించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు, రాత్రి 7.30 గంట లకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని, ప్రదర్శనలకు రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు కళాభారతిలోనూ, రంగ సాయి నాటక గ్రంథా లయం, సాయి బాదంగీర్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కు 94404 58458 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. పాత్రికేయు డు ఎస్.నాగేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- అట్టహాసంగా ఉత్తమ వలంటీర్లకు పురస్కారాల అందజేత



సేవా వజ్ర అవార్డు గ్రహీత జయలక్ష్మికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అవార్డు గ్రహీతలతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నేతలు, అధికారులు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక మరిడిమాంబ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ వలంటీర్లకు ఆయన పురస్కారాలు అందజేసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ వలంటీర్లు సేవలు గొప్పవని కొనియాడారు. అవినీతి, వివక్షకు తావులేకుండా పని చేస్తూ ప్రజా మన్ననలు పొందాలని సూచించారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. అవార్డులు రాని వలంటీర్లు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు.

మహిళలకు పెద్దపీట

మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో వలంటీర్లకు ఏ కష్టమొచ్చినా తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు, పచ్చమీడియా బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. ప్రజలకు విశేష సేవలందించి ఉత్తమ వలంటీర్లకు సేవా రత్న, సేవా మిత్ర, సేవా వజ్ర అవార్డులను ఎమ్మెల్యే ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ మడక సూరిబాబు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితులందరికీ న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బీఆర్‌టీఎస్ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: పాత గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు బాధితులందరికీ న్యాయం చేస్తామని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. పాత గోశాల నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు ఉన్న బాధితులతో పాటు జీవీఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు, పలుపార్టీల ప్రతినిధుల సమక్షంలో 98వవార్డులోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు పడితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాగే బాధితులందరికీ ఆమోదయోగ్యమైన ప్యాకేజీ ఇవ్వడానికే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. టీడీఆర్‌లు, ప్రత్యామ్నాయ స్థలం విషయం, కాంపొజేషన్ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో బాధితులు తమ డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు , ఖాళీ స్థలాలు కోల్పోయే బాధితులందరికీ నాలుగు టీడీఆర్‌ల చొప్పున ఇవ్వాలని, ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం , ఇళ్లు కోల్పోయే బాధితులకు 150 గజాలు చొప్పున ప్రత్యామ్నాయ స్థలాన్ని అందించాలని అధికారులను కోరారు. దేవస్థానంతో సబంధం లేకుండా స్థలాన్ని తమకు అందించాలని కోరారు. కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ రమణయ్య, జెడ్సీ మల్లయ్యనాయుడు, 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ టాపర్లకు సన్మానం



తానాం గురుకుల పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు



ఇంటర్ టాపర్‌ను సన్మానిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, అధికారులు

పరవాడ: తానాం మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి వేణు గోపాలకృష్ణ సత్కరించారు. ఎంజేపీఏపీబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం పది, ఇంటర్ టాపర్లను సన్మానించారు. తానాం గురుకుల పాఠశాల నుంచి టెన్త్ క్లాసులో అత్యధిక మార్కులు సాధించిన ఆర్.నీక్షిత (586), కె.లోహిత (583), వై.ప్రమీలా (583), స్థానిక గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన లో వి.భాగ్యశ్రీ ఎంఈసీలో(976), సీఈసీ విద్యార్థి పద్మనాగలక్ష్మి(967)లను మంత్రి శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ అనంతరాములు, బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ అర్జునరావు, గురుకుల సొసైటీ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్, తానాం కళాశాల ప్రిన్సిపాల్ మీసాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలపాక మంచినీటి పథకం సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మంచినీటి పథకం

పరవాడ: మండలంలోని కలపాక వాసుల దాహార్తి తీర్చడానికి సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మించిన మంచినీటి పథకం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఇటీవల రూ.22 లక్షల మంజూరు చేసింది. ఆ నిధులతో నిధులతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు 40 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన మంచినీటి పథకాన్ని నిర్మించారు. ఈ మంచినీటి పథకం నుంచి కలపాక గ్రామంతో పాటు వాటర్ ప్లాంటుకు మంచినీటిని సరఫరా చేయడానికి పైపు లైన్ పనులు కూడా పూర్తి చేశారు. ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీటిని సరఫరా చేయడానికి సన్నాహాలు చేశారు. గతంలో నిర్మించిన మరో మంచినీటి పథకం నుంచి కలపాక కాలనీవాసులకు మంచినీటిని సరఫరా చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

ఉక్కు కార్మికుడి ఇంట్లో చోరీ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడి ఇంట్లో చోరీ జరిగింది. రాత్రి డాబాపై నిద్రించి తెల్లవారి కిందికి దిగి చూసే సరికి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించిన బాధితుడు దువ్వాడ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి దరి డొంకాడ కాలనీకి చెందిన పల్లా నానాజీరావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి డాబాపై నిద్రించేందుకు వెళ్లి తిరిగి బుధవారం ఉదయం కిందికి వచ్చే చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా పరుపు తల దగ్గర ఉన్న బాక్సులో ఉండాల్సిన 2.50 తులాల బంగారం పుస్తెలతాడు, 20 తులాలు వెండి వస్తువులు కనిపించలేదు. వెంటనే దువ్వాడ క్రైమ్ పోలీసులకు నానాజీరావు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఆర్‌డీవో నేతృత్వంలో స్పందన

అక్కిరెడ్డిపాలెం: గాజువాక రెవెన్యూ కార్యాలయంలో గురువారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ బుధవారం తెలిపారు. ఆర్‌డీవో పాల్గొని గాజువాక పరిధిలో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రెవెన్యూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీతి కథల బోధన



పిల్లలకు నీతికథలు బోధిస్తున్న వక్తలు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు నీతికథలు బోధించారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్ పలు నీతి కథలు బోధించి వాటిలో నీతిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యదశ నుంచే పిల్లలకు నీతి కథలు బోధించడం ద్వారా ఉన్నతమైన ఆలోచనలను అలవర్చుకుంటారని తెలిపారు. భవిష్యత తరాల వారికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో కార్మిక నేత సీహెచ్.ఎస్.ఎన్.రాజు, న్యాయవాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27న పెయింటింగ్ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'బీచ్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 7 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 15 ఏళ్ల వయసు వారికి వేర్వేరుగా పోటీలు ఉంటా యని వివరించారు. రెండు విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు 81214 81452 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఉక్కు ఉద్యమం మార్గదర్శకం కావాలి



832వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోమని, కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కావాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బోండా తొడన్న అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 832వ ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలకొండ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు, కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం, గణేష్, పైడి కొండలరావు, ఫణీంద్రబాబు, వేణుగోపాలరావు, మోహన్‌బాబు, పుల్లారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

380 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న సర్పంచ్ నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తదితరులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో అనిల్ నీరుకొండ ఆస్పత్రి సౌజన్యంతో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి , వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 380 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు,వార్డు మెంబర్లు బోకం జగదీష్, ఎం. పైడితల్లి,అమ్మి కోటిబాబు, మాజీ వార్డు సభ్యులు ఎస్.శ్రీను, ఎస్. చిన్నంనాయుడు, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రగతికి సహకరించండి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండే కోరారు. బుధవారం హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ మిత్ర పక్షాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి, మరింత ఉత్పత్తి సాధనకు కృషి చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు వేతన సవరణ చేయాలని, మెడికల్ సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఇన్సెంటివ్ పెంచాలని, కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. గతంలో ఉన్న కార్మిక సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎంలు కె.శ్రీనివాసరావు, జి.గాంధీ, జీఎంలు కె.సంజీవరావు, బినయ్ ప్రసాద్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పునః ప్రతిష్టకు వేళాయెె

- తుది దశకు కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ ఆలయాల పనులు
- ఈ నెల 29 నుంచి ఆలయాల ప్రారంభోత్సవాలు



కుంచాలమ్మ అమ్మవారి ఆలయం



దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం



ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలో జీర్ణోద్ధరణకు గురైన ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు కొత్తగా ముస్తాబై పునః ప్రతిష్ఠకు సిద్ధమయ్యాయి. కుంచమాంబ, దుర్గమాంబ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలను తొలగించి అదే స్థానంలో రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయాల నిర్మాణాలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో ముగ్గురమ్మవార్ల ఆలయాల పునఃస్థిర ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాల నిర్మాణాలకు 2023 ఫిబ్రవరి 1న శంకుస్థాపన నిర్వహించి, 90 రోజుల్లో పూర్తి చేయడం ఆనందించతగ్గవిషయమని వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. నిర్మాణ పనుల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేయడం, దాతలు భారీగా విరాళాలు అందజేయడంతో నిర్విఘ్నంగా పనులు చేపట్టామన్నారు. ఈ నెల 27 నుంచి అమ్మవార్ల మాలధారణ భక్తులతో ఆలయాల వద్ద విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తామని తుంగ్లాం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. 31వ తేదీన శ్రీలలితా పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా అమ్మవార్ల ఆలయాలను ప్రారంభించనున్నారు. అదే రోజు శ్రీ శక్తి పీఠాధీశ్వరి మంత్రమహేశ్వరి మాతాజీ శ్రీరమ్యానంద భారతి స్వామి వేడుకల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 29న శ్రీశృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు, ప్రవచన నిధి డాక్టర్ శ్రీబాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రితో దేవీ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయన్నారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ




బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్

దాబాగార్డెన్స్: నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం జోన్-3, 5ల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కైలాసపురం, సాలిగ్రామపురం, డీఎల్బీ క్వార్టర్స్, అయ్యప్పనగర్, శ్రీనివాసనగర్, ఏఎస్సార్ నగర్, మురళీనగర్, మాధవధారతోపాటు శివాజీ పార్కు, బీచ్ రోడ్డులోని స్విమింగ్ పూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లలో పారిశుధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. చాలా చోట్ల వీధులు, రహదారులపై వ్యర్థాలు కనిపిస్తున్నాయని, ఆయా సచివాలయ పరిధిలోని శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

శివాజీ పార్కు సందర్శన..

శివాజీ పార్కును కమిషనర్ సాయికాంత్ వర్మ సందర్శించారు. మరుగుదొడ్లు, నడక మార్గం, తాగునీరు, విద్యుత్ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని ఆయనను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కమిషనర్ స్పందిస్తూ అత్యవసర పనులు త్వరితగతిన చేపట్టేందుకు టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పనులు పరిశీలించారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని, స్విమ్మింగ్ సామగ్రి అంతా సమకూర్చుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డీడీహెచ్ దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టండి



కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన ఈ స్టేషన్‌ను సందర్శించి పలు ఫైళ్లను పరిశీలించారు. మహిళలు, వృద్ధులు పిల్లలకు సంబంధించిన కేసులపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ నేరాల్లో అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సీపీ వెంట డీసీపీ-2 ఆనందరెడ్డి, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్.విజయ్ కుమార్, ఎస్ఐలు రవికిషోర్, షేక్ సమీర్, క్రైం ఎస్ఐ సునీల్, ఏఎస్ఐలు సతీష్, పాపారావు, సిబ్బంది ఉన్నారు.